క్లుప్తంగా

ఘనంగా గంగమ్మ జాతర



భక్తుల విశేష పూజలందుకుంటున్న కొత్త కోడూరు గంగమ్మ

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని కొత్తకోడూరులో వెలసివున్న గంగమ్మకు గురువారం స్థానికులు ఘనంగా జాతర నిర్వహించారు. ఉదయం పల్లకి సేవలో గంగమ్మను ఊరేగింపుగా తీసుకువచ్చి గంగమ్మ మిట్ట వద్ద ప్రతిష్ఠించారు. అనంతరం భక్తులు పెద్దఎత్తున పాల్గొని గంగమ్మకు ముడుపులు చెల్లించుకున్నారు. అలాగే పలువురు ప్రముఖులు హాజరై అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేయించారు. ఈ కార్యక్రమంలో గంగమ్మ భక్తులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో అంకాలమ్మకు పూజలు



పూజలందుకున్న అంకాలమ్మ

సిద్దవటం : మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్‌కేఆర్ నగర్ హరిజనవాడలో వెలసిన శ్రీ అంకాలమ్మ అమ్మవారికి గురువారం భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. తిరునాల సందర్భంగా అమ్మవారికి అభిషేకాలు, అలంకరణ, సహస్రనామార్చన, కుంకుమార్చన వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని కాయాకర్పూరాలను సమర్పించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనతరం ఆసాధులు అమ్మవారి కథను చెప్పారు. సాయంత్రం అంకాళమ్మ ఉత్సవ విగ్రహం, పోతుల రాజు ఊరేగింపు కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది.

నీటి ట్యాంకులను శుభ్రం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

పెనగలూరు (ఓబులవారిపల్లె) : మండలంలోని వాటర్ ట్యాంకులను వెంటనే శుభ్రం చేయాలని ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గిరిధర్‌లు తెలియజేశారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని సచివాలయ సిబ్బందికి, సెక్రటరీలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి 15 రోజులకు ట్యాంకులను శుభ్రం చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయన్నారు. మండలంలో 56 పెద్ద ట్యాంకులు, 23 చిన్న ట్యాంకులు ఉన్నాయని, ఈ ట్యాంకులను బ్లీచింగ్ ద్వారా శుభ్రం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పెనగలూరు సెక్రటరీ సుబ్బరాయుడు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమయం పాటించాలి



ఇన్‌చార్జి ఎంఈఓ విలియం రాజు

సిద్దవటం : మండలంలోని ఉపాధ్యాయులు సమయం పాటించి పాఠశాలలకు వెళ్లకపోతే అలాంటి ఉపాధ్యాయులపై చర్యలు తప్పవని ఇన్‌చార్జి ఎంఈఓ విలియం రాజు హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మండలంలో ఉన్న పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులందరూ సకాలంలో విధులకు హాజరుకావాలన్నారు. విద్యార్థినీ, విద్యార్థులకు అందించే మెనూ నాణ్యత లోపం లేకుండా చూడవలసిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. మండలంలో ఎవరైనా కంప్లైంట్ ఇస్తే చర్యలు తప్పవన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల ప్రకారం పాఠశాలలకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేస్తున్నామని, విద్యార్థులు ప్రతి రోజు క్రమశిక్షణతో పాఠశాలలకు రావాలని ఆయన తెలియజేశారు. ప్రతి పాఠశాలను తనిఖీ చేస్తామని తెలియజేశారు.

తాగునీటి సరఫరాలో అంతరాయం

చిట్వేలి : మండల కేంద్రమైన చిట్వేలిలో శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు తాగునీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని ఉప సర్పంచ్ చొడవరం ఉమామహేశ్వర్ రెడ్డి గురువారం తెలియజేశారు. ఈ మేరకు కార్యాలయాల సముదాయం వద్ద తాగునీటి సిమెంట్ పైప్‌లైన్ లీకేజీ అవుతున్న కారణంగా మరమ్మతులు చేయాల్సిన ఉంటుందన్నారు. ప్రజలు సరిపడ తాగునీటిని ముందస్తుగా భద్రపరుచుకోవాల్సిందిగా ఆయన కోరారు.

మొదలైన చదువుల సందడి

- తొలిరోజు వడివడిగా బడివైపు విద్యార్థుల అడుగులు
- కళకళలాడిన పాఠశాలలు



పాఠశాలలోకి వస్తున్న విద్యార్థులు



పాఠం వింటున్న టెన్త్ విద్యార్థులు

రాజంపేట టౌన్ : దాదాపు నలభై ఎనిమిది రోజుల తరువాత పాఠశాలలు కళకళలాడుతూ కనిపించాయి. వేసవి సెలవుల అనంతరం గురువారం పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో అనేక మంది విద్యార్థులు చదువులమ్మ ఒడివైపు వడివడిగా అడుగులు వేశారు. అయితే ఎలిమెంటరీ స్థాయి విద్యార్థులు వేసవి సెలవుల్లో సరదాగా సందడి సందడిగా గడిపి ఒక్కసారిగా పాఠశాలలకు వెళ్లేందుకు కొంతమంది మారాం చేయడం కనిపించింది. దీంతో అలాంటి విద్యార్థులను తల్లిదండ్రులు బుజ్జగిస్తూ పాఠశాలలకు తీసుకెళ్లారు. పాఠశాలలు పునఃప్రారంభమైన తొలిరోజే విద్యార్థులు పాఠశాలలకు వెళ్లడంతో ఎటుచూసినా విద్యార్థుల సందడి కనిపించింది. కాగా ఉపాధ్యాయులు పాఠశాల ప్రారంభమై తొలిరోజు కావడంతో విద్యార్థులతో సరదాగా గడిపారు. ఈ సందర్భంగా సెలవుల్లో విద్యార్థులు ఎలా గడిపారు, ఎక్కడెక్కడికి వెళ్లారు అంటూ వారిని అడిగి తెలుసుకున్నారు. అయితే టెన్త్ విద్యార్థులకు ఉపాధ్యాయులు కాస్త హితబోధన చేశారు. సమయాన్ని వృథా చేసుకోకుండా చదివితే అత్యుత్తమ మార్కులతో ఉత్తీర్ణులు కాగలరని తెలియజేశారు. అలాగే టెన్త్ పబ్లిక్ పరీక్షలకు ఇప్పటి నుంచే సన్నద్ధమయ్యేందుకు ప్రణాళికలను వారికి వివరించారు. అలాగే పాఠ్యాంశాల బోధనలను ప్రారంభించారు.

స్నేహితుల మోముల్లో తొణికిసలాడిన సంతోషం

విద్యార్థులు చాలా రోజుల తరువాత కలుసుకోవడంతో అనేక మందిలో తమ స్నేహితులను కలుసుకున్నామన్న ఆనందం కనిపించింది. విరామ సమయంలో స్నేహితులు ఒకచోట కూర్చొని సెలవుల్లో గడిపిన విషయాలను సరదాగా చెప్పుకుంటూ కనిపించారు. చాలా రోజుల తరువాత పాఠశాల ఒడిలో స్నేహితులు కలవడంతో వారిలో ఆనందం తొణికిసలాడింది. పాఠశాలలు ప్రారంభమైన తొలిరోజు కావడంతో కొంత మంది తల్లిదండ్రులు తమ పిల్లలను స్వయంగా పాఠశాలల వద్ద వదలివెళ్లారు.

ఆనందం వేసింది



నేను ఆరవ తరగతి నుంచి రాజంపేట ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నాను. అందువల్ల నాకు చాలా మంది స్నేహితులు ఉన్నారు. సెలవులు అయినందున దాదాపు యాభై రోజుల పాటు స్నేహితులను కలవలేకపోయాను. చాలా రోజుల తరువాత స్నేహితులం కలిసే సరికి చాలా ఆనందం వేసింది. ఇప్పుడు నేను టెన్త్, నేను, మా స్నేహితులు బాగా చదివి టెన్త్ పాస్ అయ్యి ఒకే కాలేజీలో చేరుతాం.

– ఆనంద్, టెన్త్ విద్యార్థి, ప్రభుత్వ హైస్కూల్, రాజంపేట

మంచి ఫలితాల సాధనకు కృషి



వచ్చే ఏడాది జరగనున్న టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో మంచి ఫలితాల సాధనకు ఇప్పటి నుంచే కృషి చేస్తాం. అలాగే అన్ని తరగతుల్లో విద్యార్థుల సామర్థ్యాలను పెంచేందుకు చర్యలు తీసుకుంటాం. ఈ విషయంలో ఉపాధ్యాయులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తాం. తరచూ పాఠశాలలు తనిఖీ చేయడంతోపాటు ఉపాధ్యాయులతో సమావేశాలు నిర్వహిస్తాం.

– రఘునాథరాజు, ఎంఈఓ, రాజంపేట

మోగిన బడిగంటలు



పెనగలూరు : పాఠ్యపుస్తకాలను పంపిణీకి సిద్ధం చేస్తున్న ఎంఈఓ గిరివరదయ్య



పెనగలూరు : మోడల్ స్కూల్‌లో పాఠశాలకు హాజరైన విద్యార్థులు

పెనగలూరు (ఓబులవారిపల్లె) : 50 రోజులు సెలవుల అనంతరం పాఠశాలలు గురువారం ప్రారంభమయ్యాయి. దీంతో పాఠశాలల్లో బడిగంటలు మోగాయి. విద్యార్థులు సెలవులు అనంతరం ఉల్లాసంగా పాఠశాలలకు తరలివెళ్లారు. అడ్మిషన్లు జోరుగా జరుగుతున్నట్లు ఎంఈఓ గిరివరదయ్య తెలిపారు. మోడల్ స్కూల్‌లో విద్యార్థులు పాఠశాలలకు అధిక సంఖ్యలో విచ్చేశారు. మోడల్ స్కూల్‌లో తరగతులు ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ సహజ బ్లెస్సీ తెలిపారు. గతంలో ప్రవేశపరీక్ష రాసి ఎన్నికైన విద్యార్థులు తరగతులకు హాజరుకావాలని ఆమె కోరారు.

పంపిణీకి సిద్ధంగా పాఠ్యపుస్తకాలు

పెనగలూరు మండలంలో విద్యార్థులకు పంపిణీ చేసేందుకు పాఠ్యపుస్తకాలు సిద్ధంగా ఉన్నాయని ఎంఈఓలు గిరివరదయ్య, సుబ్బరాయుడులు తెలిపారు. గురువారం ప్రైమరీ పాఠశాలలు, హైస్కూల్ పుస్తకాలను సీఆర్‌పీల సహాయంతో పంపిణీకి సిద్ధం చేస్తున్నారు. మండలంలో ప్రైమరీ పాఠశాలల్లో 1658 మంది విద్యార్థులు ఉండగా 11036 పుస్తకాలు మండలానికి వచ్చాయన్నారు. అలాగే హైస్కూల్‌లలో 2117 మంది విద్యార్థులు ఉండగా 17636 పుస్తకాలు మండలానికి చేరుకున్నాయన్నారు. శుక్రవారం నుంచి పాఠశాలలకు పుస్తకాలను సరఫరా చేసి విద్యార్థులకు పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పాఠశాలను ప్రారంభించే నాటికి విద్యార్థులకు ఆలస్యం లేకుండా పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తామన్నారు. ఒకటి, రెండు రోజులలో విద్యార్థులకు సంబంధించిన అన్ని రకాల కిట్లను అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీలు సుజాత, బాదుషా, శశికళ, నరసింహులు, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ విజయ్, మోడల్ స్కూల్ ఇన్‌చార్జ్ నజీర్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు స్థలాలు ఇచ్చి ఇళ్లు కట్టించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ మండల కార్యదర్శి దార్ల రాజశేఖర్

రైల్వేకోడూరు : నియోజకవర్గంలోని దివ్యాంగులకు మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇచ్చి ప్రభుత్వమే ఇళ్లు కట్టించాలని సీపీఐ మండల కార్యదర్శి దార్ల రాజశేఖర్ తెలిపారు. గురువారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ దివ్యాంగులకు బ్రతుకుదెరువు కోసం రెండు ఎకరాలు అసైన్‌మెంట్ కమిటీ ద్వారా ప్రభుత్వ బంజర భూములు ఇచ్చి, బోర్లు వేసి విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రతి నెలా 7 వేలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే నడవలేక మంచానికి పరిమితమైన ప్రతి దివ్యాంగుడికి రూ.10వేలు పెన్షన్ ఇవ్వాలన్నారు. బ్యాంకుల ద్వారా వడ్డీ లేని రుణాలు సబ్సిడీ కింద రూ. 2లక్షల వరకు ఇవ్వాలని కోరారు. ప్రతి దివ్యాంగుడికి పర్సెంటేజ్‌తో సంబంధం లేకుండా స్కూటీలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. అలాగే మెరుగైన వైద్యం కోసం 50 శాతం రాయితీ ఇవ్వాలని కోరారు. ఇవి నెరవేర్చని ఎడల నియోజకవర్గంలో ఉన్న దివ్యాంగులంతా ఏకమై పెద్ద ఎత్తున తహసీల్దారు కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం రైల్వేకోడూరు మండలంలో 13 మంది సభ్యులతో దివ్యాంగుల నూతన కమిటీ ఏర్పాటు చేశారు. కోడూరు మండల అధ్యక్షులు చొడవరం వెంకటరమణ, ఉపాధ్యక్షులు సుబ్బయ్య, కార్యదర్శులుగా ఇంద్రాణి, మీనా, శ్రీధర్, కమిటీ సభ్యుడిగా వెంకటసుబ్బయ్యలను ఎన్నుకున్నారు.

బీసీజీ టీకాతోనే టీబీ నివారణ



బీసీజీ టీకాను వేస్తున్న వైద్య సిబ్బంది

సుండుపల్లె : క్షయవ్యాధి వ్యాప్తిని సమూలంగా నిర్మూలించేందుకు అడల్ట్ బీసీజీ టీకాను సద్వినియోగం చేసుకోవాలని సుండుపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు హసన్ వలీ, ఫర్హా ఖానంలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటి వరకు బీసీజీ టీకాను చిన్నారులకు మాత్రమే వేశామన్నారు. క్షయవ్యాధి నిర్మూలనలో భాగంగా 60 సంవత్సరాలు పైబడిన వారందరికీ, 18 నుంచి 60 సంవత్సరాలలోపు వయస్సు ఉన్న వారికి టీబీ వ్యాధి వచ్చే అవకాశం ఉందని గుర్తించిన వారికి, పొగత్రాగు వారికి, మద్యం సేవించు వారికి, షుగరు వ్యాధి గ్రస్తులకు, ఇంతకు ముందు 5 సంవత్సరాలు టీబీ వచ్చి నయం అయిన వారికి ఈ అడల్ట్ బీసీజీ టీకా వారిలో వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించి వారికి టీబీ వ్యాధి రాకుండా నిరోధిస్తుందని చెప్పారు. గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కార్యకర్తలు, ప్రతి గ్రామంలో బీసీజీ టీకాలు వేస్తున్నారని తెలియజేశారు. ప్రజలందరూ సహకరించి ఈ టీకాను వేసుకోవాలని సూచించారు.

నీట్ ఫలితాల అవకతవకలపై విచారణ జరిపించాలి

నిరసన ప్రదర్శనలో ఆర్‌ఎస్‌యూ డిమాండ్



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

రాయచోటి అర్బన్ : నీట్ పరీక్షా ఫలితాలలో జరిగిన అవకతవకలపై వెంటనే విచారణ జరిపించాలని జిల్లా ఆర్‌ఎస్‌యూ కార్యదర్శి వంశీరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం నీట్ ఫలితాలపై విచారణ జరిపించాలన్న డిమాండ్‌తో తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆర్‌ఎస్‌యూ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్ ఫలితాల్లో 57 మంది విద్యార్థులకు 720కి 720 మార్కులు వచ్చి జాతీయస్థాయిలో ప్రథమ ర్యాంకు రావడం, ఇందులో ఒకే సెంటర్‌లో 7 మంది విద్యార్థులు ఉండడం అనేక అనుమానాలు కలుగుతున్నాయన్నారు. జూన్ 14న విడుదల కావలసిన నీట్‌పరీక్షా ఫలితాలను హడావిడిగా జూన్ 4న విడుదల చేయడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. వెంటనే నీట్ పరీక్షల నిర్వహణపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలన్నారు. ఇదే సమయంలో నీట్ పరీక్షల ఫలితాలను వెంటనే రద్దు చేయాలంటూ వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌యూ నేతలు చరణ్, ప్రతాప్, మధుసూదన్, నవీన్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే గ్రామాల అభివృద్ధి



మండల సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

చిట్వేలి : ప్రజాప్రతినిధులు అధికారులను సమన్వయంతో పనిచేసి గ్రామాల అభివృద్ధి చేయాలని ఎంపీపీ టంగుటూరి చంద్ర కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక ఎంపీపీ సభా భవనంలో ఎంపీపీ టంగుటూరి చంద్ర అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. అధికారులు మండలంలో జరుగుతున్న అభివృద్ధిని శాఖలవారీగా వివరించారు. సీడీపీఓ రాజేశ్వరి మాట్లాడుతూ మండలంలో అనాథ పిల్లలను గుర్తించి వారికి ప్రభుత్వం తరపున వసతి, విద్యను అందిస్తామన్నారు. ఎస్ఐ సుధాకర్ మాట్లాడుతూ మైనర్లకు ద్విచక్రవాహనాలు ఇవ్వడం వలన ప్రమాదాలకు గురి కావడమే కాకుండా నూరేళ్ల జీవితాన్ని అంధకారంలో నెట్టుకుంటున్నారన్నారు. తల్లిదండ్రులు పిల్లల పట్ల జాగ్రత్త వహించాలని కోరారు. చిట్వేలి, కోడూరు రహదారి పనులు జరుగుతున్న కారణంగా ప్రజలు అప్రమత్తంగా వాహనాలు నడపాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎల్‌వీ మోహన రెడ్డి, ఉపాధ్యక్షులు సుబ్రమణ్యంరెడ్డి, ఎంపీడీఓ వెంకట రంగారావు, అన్నిశాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

జూనియర్ సివిల్ జడ్జి వి.గాయత్రి



ఆశ్రమంలో భోజనం వడ్డిస్తున్న జడ్జి వి.గాయత్రి

సిద్దవటం : సిద్దవటం-భాకరాపేట ప్రధాన రహదారిలో ఉన్న పరమాత్మా సేవా వృద్ధాశ్రమంలో గురువారం మండల లీగల్ సర్వీస్ కమిటీ అధ్యక్షతన ఆశ్రమంలోని వృద్ధులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించామని సిద్దవటం కోర్టు జూనియర్ సివిల్ జడ్జి గాయత్రి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వృద్ధుల ఆరోగ్య సమస్యలను వారిని అడిగి తెలుసుకున్నామన్నారు. వృద్ధాశ్రమంలోని వృద్ధులకు ప్రతి ఒక్కరూ చేయూతను ఇవ్వాలన్నారు. అనంతరం జడ్జి వృద్ధులకు భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, పోలీసులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ ఆదాలత్‌ను జయప్రదం చేయండి

ఈనెల 29వ తేదీన జరగనున్న జాతీయ లోక్ ఆదాలత్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిద్దవటం జూనియర్ సివిల్ కోర్టు జడ్జి వి.గాయత్రి పిలుపునిచ్చారు. సిద్దవటం జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో గురువారం ఆమె కోర్టులో క్రైమ్ మీటింగ్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిద్దవటం, ఒంటిమిట్ట, అట్లూరు పోలీసు స్టేషన్‌ల పరిధిలో ఉన్న సివిల్, క్రిమినల్ కేసులు ఇతర కేసులను కక్షిదారులు పరిష్కరించుకొని లోక్ ఆదాలత్‌లో రాజీపడి తమ విలువైన సమయాన్ని, డబ్బులను ఆదా చేసుకోవాలని ఆమె సూచించారు. లోక్ అదాలత్‌లో రాజీపడితే అది ఫైనల్ అని తరువాత ఎటువంటి అప్పీళ్లకు వెళ్లేందుకు అవకాశం ఉండదన్నారు. కావున కక్షిదారులందరూ ఈ జాతీయ లోక్ ఆదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట సీఐ పురుషోత్తంరాజు, సిద్దవటం ఎస్ఐ పెద్ద ఓబన్న, ఒంటిమిట్ట ఎస్ఐ మధుసూదన్‌రావు, స్థానిక న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణ నుంచి వంక భూమిని కాపాడండి



ఆక్రమణ గురైన వంక భూమిని పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

రామాపురం : మండలంలోని బండపల్లి గ్రామ పరిధిలోని సర్వేనెంబరు 194, 200 గల ప్రభుత్వ వంకను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం సీపీఐ బృందంతో ఆక్రమణకు గురికాబడిన వంక ప్రాంతాన్ని పరిశీలించారు. మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో పలుకుబడి కలిగిన కొందరు దళితుల భూములకు డబ్బులను ఎరగా చూపించి చౌకగా వారి నుండి కాజేశారని, చుట్టుగల ప్రభుత్వ వాగులు, వంకలను సైతం కబ్జా చేసి వారి ఇష్టానుసారం కంచెలు వేస్తూ చుట్టుపక్కల రైతులకు ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. భూకబ్జాదారులపై రెవెన్యూ అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి ప్రభుత్వ వాగులను, భూములను కాపాడాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో భూమి కోల్పోయిన రైతులతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఆయనతో పాటు సీపీఐ నాయకులు వాసుకుమార్, ప్రసాద్, సతీష్‌నాయక్, రెడ్డినాయక్‌లు పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీపై చర్యలు తీసుకోండి



డీఈఓ కార్యాలయం ఏడీకి వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నేతలు

రాయచోటి అర్బన్ : కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలు చేస్తున్న విచ్చలవిడి ఫీజుల దోపిడీని వెంటనే అరికట్టాలని అన్నమయ్య జిల్లా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాధవ్, కోటేశ్వరరావులు డిమాండ్ చేశారు. జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం ఏడీ ప్రసాద్‌బాబును వారు కలిసి ఈ మేరకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి అడ్మిషన్ ఫీజు, స్కూల్ ఫీజు, యూనిఫాం ఫీజు, హాస్టల్ ఫీజు తదితరాల పేరుతో నిలువు దోపిడీ చేస్తున్నారంటూ ఆరోపించారు. అర్హతలేని ఉపాధ్యాయులతో బోధన చేయిస్తూ నాణ్యమైన విద్యనందించడం లేదన్నారు. పైగా మెరుగైన మార్కుల కోసం తీవ్రమైన ఒత్తిడి తెస్తుండడంతో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారంటూ చెప్పారు. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న సైనిక్, నవోదయ కోచింగ్ సెంటర్లను వెంటనే మూయించి వేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నేతలు సతీష్‌నాయక్, వాసుదేవ నాయక్, కుమార్‌నాయక్, నరేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మిగిలిపోయిన సీట్లకు 15న రాత పరీక్ష

లక్కిరెడ్డిపల్లె : ఈనెల 15వ తేదీ శనివారం ఏపీ మోడల్ స్కూల్‌లో మిగిలిన సీట్లు 7, 8, 9 తరగతులకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు రాత పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కోమటిరెడ్డి శివశంకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ మోడల్ స్కూల్‌లో మిగిలిన సీట్ల కోసం దరఖాస్తు చేసుకునే విద్యార్థులు శనివారం 9 గంటలలోపు పాఠశాలలో ఉండాలని, రాత పరీక్ష అనంతరం మెరిట్ ప్రకారం విద్యార్థుల ఎంపిక జరుగుతుందన్నారు. 6వ తరగతిలో పరీక్ష రాసి ఎంపికైన విద్యార్థులను ఒరిజినల్ టీసీ, స్టడీ, ఆధార్ కార్డుతో పాఠశాలలో చేరాలని ఆయన కోరారు. 20వ తేదీలోపు పాఠశాలలో సర్టిఫికెట్లు అందజేయాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ విషయాన్ని గుర్తించి ఆరవ తరగతిలో తమ పిల్లలను చేర్పించాలని వారు కోరారు.

డ్వాక్రా రుణాలు సక్రమంగా చెల్లించాలి



డ్వాక్రా మహిళలతో మాట్లాడుతున్న వెలుగు సీసీ రుద్రాచారి

పుల్లంపేట : డ్వాక్రా రుణాలు సకాలంలో చెల్లించాలని ఏపీఎం సుబ్బలక్షుమ్మ అన్నారు. గురువారం అనంతంపల్లి రామాలయంలో డ్వాక్రా మహిళలతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెలుగు సీసీ రుద్రాచారి మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు సకాలంలో రుణాలు చెల్లించి బ్యాంకుల నుంచి సబ్సిడీలు పొందాలన్నారు. నూతన ప్రభుత్వం త్వరలో డ్వాక్రా మహిళలకు రుణాలు మంజూరు చేస్తుందన్నారు. ప్రతి నెల సమావేశం నిర్వహించి గ్రామ సంఘాల అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ చేసిన డీపీఎంఓ



శిబ్యాల ఆరోగ్య ఉపకేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీపీఎంఓ, అధికారులు

రాయచోటి అర్బన్ : మండలంలోని యండపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని శిబ్యాల ఆరోగ్య ఉపకేంద్రాన్ని గురువారం డీపీఎంఓ రియాజ్‌బేగ్ తనిఖీ చేశారు. జాతీయ నాణ్యతా ప్రమాణాల ప్రతినిధులు డాక్టర్ చంద్రకాంత్, రాజలతో కలసి ఆయన పీహెచ్‌సీ పరిధిలోని శిబ్యాల ఆరోగ్య ఉప కేంద్రంను సందర్శించారు. చెక్‌లిస్టు ఆరోగ్య ఉప కేంద్రంలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా డీపీఎంఓ రియాజ్‌బేగ్ మాట్లాడుతూ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లలో ఆరోగ్య సూచికల మేరకు ఉండవలసిన పరికరాలు, మందులు, ఐఈసీ సామగ్రి, రికార్డులు, సిబ్బంది పర్ఫార్మెన్స్‌లను పరిశీలించామన్నారు. కేంద్రం పనితీరుపై ఒక నివేదికను తయారుచేసి రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట యండపల్లె పీహెచ్‌సీ వైద్యురాలు జ్యోతి, జిల్లా జాతీయ ప్రమాణాల ప్రతినిధి నాగరాణి, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.


నీటి ఆదాతో శక్తి ఆదా



మొక్కలు నాటుతున్న విద్యార్థినులు

రాజంపేట టౌన్ : నీటిని ఆదా చేయడం వల్ల శక్తి ఆదా అవుతుందని బోయినపల్లె హైస్కూల్ హెచ్‌ఎం భారతి తెలిపారు. ఆ పాఠశాలలో గురువారం మిషన్‌లైఫ్ రోజువారి కార్యక్రమాల్లో భాగంగా సేవ్ వాటర్, సేవ్ ఎనర్జీపై విద్యార్థులు చెట్లు నాటారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ తక్కువ నీటిని వాడటం వల్ల పర్యావరణ వ్యవస్థలో ఎక్కువగా ఉంచబడుతుందన్నారు. నీటిని పొదుపుగా వాడటం వల్ల డబ్బు ఆదా అవుతుందన్నారు. భవిష్యత్తు తరాలకు స్థిరమైన ప్రపంచాన్ని అందించాలంటే పర్యావరణాన్ని కాపాడుకోవడంతోపాటు నీటిని పొదుపుగా వాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శారద, శ్రీలత, షఫీ, శివయ్య, పి.జనార్దన్, దండు సుబ్బారెడ్డి, ఎస్‌వీ రామరాజు, అమరావతి, ఈశ్వర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న దాత కుటుంబ సభ్యులు

రామాపురం : లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో రాయచోటికి చెందిన నాగరాజు కుమార్తె మనస్వి ద్వితీయ పుట్టినరోజు సందర్భంగా గురువారం మండలంలోని బండపల్లె వద్ద గల ప్రేమాలయం వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టినట్లు ట్రెజరర్ లయన్ హరీష్ చంద్ర తెలిపారు. దాత మాట్లాడుతూ తన కుమార్తె జన్మదిన వేడుకలను వృద్ధాశ్రమంలో జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని, భవిష్యత్తులో ఇలాంటి సేవా కార్యక్రమాలకు సహాయ సహకారాలను అందిండం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మదన్‌మోహన్‌రెడ్డి, వరలక్ష్మి, నాగేష్, వెంకటరమణ, నారాయణమ్మ, మౌనిక, సుప్రియ, ఆశ్రమం మేనేజర్ వెంకటసుబ్బయ్య, దేవ, ఆశ్రమం సిబ్బంది, దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి పొంగళ్లు మహోత్సవం

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లిలో వెలసిన మారెమ్మ తల్లి ఆలయంలో ఈనెల 14వ తేదీ శుక్రవారం నుంచి అమ్మవారి పొంగళ్ల మహోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 14వ తేదీ శుక్రవారం ఆలయంలో మహాగణపతి పూజ కార్యక్రమాలతో ప్రారంభించి ధ్వజారోహణ కార్యక్రమం, మహాగణపతి హోమం, అమ్మవారి మూల మంత్ర హోమాలు జరుపుతామన్నారు. 15వ తేదీ శనివారం ఉదయం 8 గంటలకు చండీ హోమం, విచ్చేసిన భక్తులకు మధ్యాహ్నం 12 గంటలకు భోజన సదుపాయాన్ని కల్పించనున్నట్లు పేర్కొన్నారు. 16వ తేదీ ఉదయం 10 గంటలకు పొంగళ్ల కార్యక్రమం వైభవంగా జరుగుతుందన్నారు. సోమవారం అమ్మవారికి పాలాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు.